సాక్షి
నంద్యాల
ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



**ఆంధ్రా తిలక్.. గాడిచెర్ల**
గ్రంథాలయ పితామహుడిగా గాడిచెర్ల హరిసర్వోత్తమరావు పేరు ప్రఖ్యాతలు గడించారు. ఆంధ్రా తిలక్‌గా జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారు. 8లో ▸



**అన్నప్రసాద వితరణకు విరాళం**
శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి శనివారం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన డి.లక్ష్మీప్రసన్నరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.అయ్యన్నకు అందజేశారు.



**టీబీ డ్యాం సమాచారం**

| | |
|---|---|
| పూర్తి మట్టం | : 1,633 అడుగులు |
| ప్రస్తుతం | : 1,626.06 |
| టీఎంసీల సామర్థ్యం | : 105.788 |
| ప్రస్తుతం | : 80.003 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 13,687 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 13,533 |

## న్యూస్‌రీల్

### జిల్లా నూతన ఎస్పీగా సునీల్ షెరాన్



నంద్యాల: జిల్లా నూతన ఎస్పీగా సునీల్ షెరాన్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సునీల్ షెరాన్ 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం ఈయన విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుత జిల్లా ఎస్పీగా పని చేస్తున్న అధిరాజ్‌సింగ్‌రాణాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. 2024 జూలై నెలలో నంద్యాల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాణా 14 నెలలు పాటు ఇక్కడ పని చేశారు.

### పెన్షనర్ల సంఘం ఎన్నికలకు 36 నామినేషన్లు



ప్రధాన కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న మేకల లింగస్వామి

నంద్యాల(అర్బన్): జిల్లా పెన్షనర్ల సంఘం కార్యవర్గంలోని 17 పదవులకు శనివారం 36 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి పెద్దన్న గౌడ్ తెలిపారు. స్థానిక సంఘం భవనంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నామినేషన్ల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్, అసోసియేట్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్ పదవులతో పాటు ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు జాయింట్ సెక్రటరీల పదవులకు 36 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, 26న ఎన్నికల నిర్వహణను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి ప్రభాకర్, సహాయకులు కిట్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

### అతిసార వ్యాధితో వ్యక్తి మృతి

రుద్రవరం: కొండమాయపల్లెకు చెందిన గుర్రప్ప (36)అనే వ్యక్తి శనివారం అతిసార వ్యాధితో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రప్ప శుక్రవారం అతిసారం బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు రుద్రవరం, ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. గుర్రప్ప గత 15 ఏళ్ల క్రితమే తల్లిదండ్రులను కోల్పోయి దగ్గరి బంధువుల ఉంటూ పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదని గ్రామస్తులు తెలిపారు.

### ఉల్లి గడ్డలతో నిండిపోయిన మార్కెట్




మార్కెట్ యార్డులో పేరుకపోయిన ఉల్లి నిల్వలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లిగడ్డలతో కర్నూలు వ్యవసాయ మార్కెట్ నిండిపోయింది. మార్కెట్‌లోని అన్ని షెడ్లు, కమీషన్ ఏజెంటు దుకాణాల ఎదుట ఉల్లి సంచులే కనిపిస్తున్నాయి. రైతులు శనివారం సరుకును తీసుకురాలేదు. ఇది వరకే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి మార్కెట్ యార్డులో పేరుకపోయింది. మరోవైపు వ్యాపారులు కొనకుండా వదిలేసిన లాట్లు వందలాదిగా ఉండిపోయాయి. దీనిని మార్క్‌ఫెడ్ కొనాల్సి ఉంది. సోమవారం ఉదయం లోపు ఖాళీ అయితేనే రైతులు తెచ్చిన ఉల్లిని అమ్మకానికి పెట్టే అవకాశం ఉంది. కుళ్లిపోయిన ఉల్లిగడ్డలు గుట్టలుగా ఉండిపోవడం, మార్కెట్ యార్డులో పారిశుద్ధ్యలోపం ఎక్కువ కావడంతో దుర్వాసన వస్తోంది.

# ఊరూరా మందుపాతరలు

**పల్లెలు తూలుతున్నాయ్..**
- జిల్లాలో 1,500కు పైగానే బెల్ట్ షాపులు
- టీడీపీ నేతల కనుసన్నల్లోనే నిర్వహణ
- అర్ధరాత్రి 12గంటల వరకు అమ్మకాలు
- మినీ బార్లుగా బెల్ట్ దుకాణాలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- మద్యం మత్తులో చిత్తవుతున్న యువత



**పల్లెల్లో తెల్లవారు** జామున కోడి కూత వినకముందే మద్యం విక్రయాలు ప్రారంభమవుతున్నాయి. ఇవి అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. కూలీల రెక్కల కష్టాన్ని గ'మ్మత్తు'గా దోచేస్తున్నాయి. పేదల ఇళ్లలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. ఊరూరా వెలిసిన 'మందు' పాతరలతో ప్రాణాలు సైతం గాలిలో కలసిపోతున్నాయి. అయినా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదు. మద్యం విక్రయాలకు బ్రేకులు వేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అర్ధరాత్రి వరకు జరిగే మద్యం విక్రయాలకు కట్టడి చేయాల్సి ఉంది.

నంద్యాల: మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం 14 గంటల సమయం కేటాయించింది. అయితే 'కూటమి' నాయకులు అందుకు విరుద్ధంగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 24 గంటల పాటు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో మద్యం ఏరులై పారుతోంది. పట్టణాల్లోని ప్రతి వీధుల్లో బెల్ట్‌షాపులు కనిపిస్తున్నాయి. అది చాలదన్నట్లు ప్రతి మద్యం దుకాణానికి పర్మిట్ రూములు, 14 గంటలు బార్లు తెరుచుకునేలా ప్రభుత్వం నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 116 లైసెన్స్ దుకాణలు ఉన్నాయి. అలాగే 19 బార్లు నడుస్తున్నాయి. ఇవి కాకుండా బెల్ట్ షాపులు 1,500కు పైగా ఉన్నాయి. జిల్లాలో ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఇవి చాలవన్నట్లు అమ్మకాలు పెంచుకునేందుకు పర్మిట్ రూంలు, బార్‌లకు 14 గంటలు అనుమతి ఇచ్చి మరి అమ్మకాలు జరుపుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మినీ బార్లుగా బెల్ట్ దుకాణాలు!**
మద్యం దుకాణాల యజమానులు బెల్ట్ షాపుల కోసం వస్తున్న వారి నుంచి రూ.లక్ష డిపాజిట్ వసూలు చేస్తున్నట్లు సమాచారం. షాపు యజమానులు సిండికేట్‌గా ఏర్పడి లాటరీ ఫీజు, లైసెన్స్ ఫీజు, షాపు అద్దె, సిబ్బంది వేతనాల రూపంలో అయ్యే ఖర్చును రాబట్టేందుకు బెల్ట్ షాపులను ఆదాయ వనరులుగా మలచుకుంటున్నారు. గతంలో బెల్ట్ షాపుల్లో కేవలం చీప్ లిక్కర్ విక్రయించే వారు. ఇప్పుడు బెల్ట్ షాపుల్లో బీర్లతో సహా అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చారు. పేరుకు బెల్ట్ షాపు అయినప్పటికీ లైసెన్సు లేని మినీ మద్యం షాపు అంటే అతిశయోక్తి కాదేమో మరి! ఇప్పటికే పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే నిర్వహించాల్సి ఉండగా అర్ధరాత్రి వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. సిట్టింగ్ రూమ్స్ ఏర్పాటు చేసి విచ్చలవిడిగా తాగిస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు కుప్పలు తెప్పలుగా ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి.

**తెల్లవారుజామున 5 గంటల నుంచే..**
ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా జిల్లాలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 5గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు తొంగి చూసే సాహసం చేయడం లేదు. బెల్ట్ దుకాణదారులు రాత్రి పూట ప్రత్యేకంగా మనిషిని నియమించి మరి మద్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో 1,500కు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయి. దేవాలయాలు, పాఠశాలల సమీపంలో కొన్నింటిని ఏర్పాటు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. అమ్మకాలను బట్టి ఒక్కో షాపునకు నెలకు రూ.5వేల వరకు ఎక్సైజ్ అధికారులు, పోలీసులకు మామూళ్లు ముడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మద్యం మత్తులో...**
గత నెలలో గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన ప్రసాద్ (55) అనే వ్యక్తి మద్యం మత్తులో ఊరిలో బురదమయంగా ఉన్న రోడ్డుపై జారి కిందపడి మృతి చెందాడు. ఆగస్టు నెలలోనే కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు రోడ్డు సమీపంలోని ఓ నీటి గుంతలో మద్యం మత్తులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మద్యం మత్తులో కుటుంబ సభ్యులను కొట్టడం కేసులు నమోదు కావడం పరిపాటిగా మారింది. మద్యం సేవించి మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడే వారు తరచూ కనిపిస్తున్నారు. పోలీసులు జరిమానాలు విధిస్తున్నా డ్రంకన్ డ్రైవ్ కేసులు మాత్రం తగ్గడం లేదు. మరో వైపు పవిత్ర క్షేత్రాల్లో కూడా గుట్టుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఆగస్టు నెలలో శ్రీశైలంలో ఓ వ్యక్తి మద్యంతో పోలీసులకు పట్టుబట్టాడు. అతని నుంచి శ్రీశైలం టోల్‌గేట్ వద్ద 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

➤ జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామంలో బెల్టుదుకాణాలపై ఈనెల 7వ తేదీన నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ మల్లికార్జున దాడులు చేశారు. బెల్టు దుకాణం నిర్వాహకుల ఇళ్లల్లో సోదాలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.



➤ పడమర ప్రాతకోట ప్రాథమిక పాఠశాల (మెయిన్) పక్కన బెల్ట్‌షాప్ నిర్వాహకుడు పులికంటి మద్దిలేటిని ఈనెల 11వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. బడి పక్కన బెల్ట్ షాప్ నిర్వహణను సాక్షిలో ప్రచురితం కావంతో పోలీసులు స్పందించి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.



**జిల్లాలో మద్యం అమ్మకాలు (రూ.కోట్లలో)**

| నెల | విక్రయాలు |
|---|---|
| 2024 అక్టోబర్ | 78.86 |
| నవంబర్ | 69.68 |
| డిసెంబర్ | 82.24 |
| 2025 జనవరి | 73.23 |
| ఫిబ్రవరి | 71.21 |
| మార్చి | 77.85 |
| ఏప్రిల్ | 88.16 |
| మే | 89.83 |
| జూన్ | 83.82 |
| జూలై | 79.72 |
| ఆగస్టు | 78.31 |

**నెలకు రూ.80 కోట్ల మద్యం వ్యాపారం**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. నెలకు సరాసరి రూ.82 కోట్లు అధికారిక మద్యం వ్యాపారం జరుగుతోంది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రూ.901.96 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

**“ మహిళలపై పెరిగిపోయిన హింస**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై హింస పెరిగింది. మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. మద్యం తాగే వారు ఎక్కువ కావడంతో మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడి పోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయితే అర్ధరాత్రి వరకు అనుమతులు ఇచ్చి మద్యం విక్రయించడం చాలా దారుణం. ఆదాయం గురించి తప్ప ప్రజారోగ్యం గురించి పాలకులు పట్టించుకోకపోవడం విచారకరం.
–శశికళారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, నంద్యాల

**అర్ధరాత్రి వరకు అనుమతి ఇవ్వడం దారుణం**



రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మద్యం తాగే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ శివారు ప్రాంతాల్లో శ్రామికులు రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బులతో మద్యం తాగుతున్నారు. డబ్బులు లేక, నిత్యావసరాలు కొనుగోలు చేయలేక పేదల ఇళ్లల్లో వృద్ధులు, పిల్లలు పస్తులుండాల్సి వస్తోంది. పిల్లల ఆకలి బాధలు చూడలేక కొందరు మహిళలు కూలీ పనులకు వెళ్తున్నారు. మద్యం విక్రయాలు తగ్గించకుండా అర్ధరాత్రి వరకు అమ్ముకోవడానికి అనుమతి ఇవ్వడం దారుణం.
– సుశీలమ్మ, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు, నంద్యాల

## జాతీయ లోక్ అదాలత్‌లో 8,122 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు: జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8,122 కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్ అదాలత్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 60 మంది రైతుల వారసులకు రూ.83,96,374 నష్టపరిహారాన్ని జిల్లా జడ్జి చేతుల మీదుగా ఇప్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 20 బెంచీలను ఏర్పాటు చేసి 8,122 కేసులను పరిష్కరించామన్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి కమలా దేవి, 6వ అదనపు జిల్లా జడ్జి వాసు, సీబీఐ కోర్టు జిల్లా జడ్జి శోభారాణి, కర్నూలు బార్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మీనరసింహా రెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, న్యాయవాదులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు 30 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనం దరఖాస్తుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉంది. నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు కాగా.. ఇందులో అర్హత సాధిస్తే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్లు ఏటా రూ.12 వేల చొప్పున ఉప కార వేతనం అందనుంది. ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ 7వ తరగతిలో ఓసీ, బీసీలైతే 55 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ పొందిన వారు అర్హులు. ప్రభుత్వ ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్ విద్యార్థులు, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు, గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది. www.bse.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

## నల్లమలకు విశిష్ట అతిథులు

- 66 కృష్ణ జింకలు, 6 చుక్కల దుప్పలను వదలిన అధికారులు



ఎన్‌క్లోజర్‌లోకి పరుగులు తీస్తున్న కృష్ణ జింకలు

ఆత్మకూరురూరల్: ఎన్‌ఎస్‌టీఆర్‌లో మాంసాహార జంతువులు, గడ్డిమేసే జంతువుల నిష్పత్తిలో తేడాను సవరించడంలో భాగంగా ఆత్మకూరు డివిజన్ అటవీ అధికారులు శనివారం నల్లమలలో మొత్తం 72 జింకలను వదలారు. 66 కృష్ణ జింకలు, 6 చుక్కల దుప్పులను సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి తరలించి ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని రుద్రకోడు సెక్షన్‌లో వదిలారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లో వీటిని వదిలారు. స్థానిక వాతావరణానికి అలవాటు పడిన తరువాత వీటిని ఎన్ క్లోజర్ నుంచి బయటకు విడిచి పెడతారు. ఇప్పటికే నల్లమలలోని బైర్లూటి రేంజ్‌లో, నంద్యాల అటవీ డివిజన్ లోని పచ్చర్ల బీట్‌లో దుప్పులను, జింకలను వదిలారు. వీటిని నాగార్జునా ఫెర్టిలైజర్స్ కంపెనీ గ్రీన్ ఏరియాలో నుంచి తీసుకొచ్చారు.

### పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల తగ్గింపు

జూపాడుబంగ్లా/పాములపాడు: వర్షాల నేపథ్యంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 32 వేల నుంచి 8వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. పోతిరెడ్డిపాడు వద్ద 883.10 అడుగుల నీటిమట్టం నమోదు కాగా హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ఎత్తును కిందికి దించి 8 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ 5 వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ (జీఎన్‌ఎస్‌ఎస్)కాల్వకు 2 వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 1,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

## కూలీల జాతర!



ఒకరు.. ఇద్దరు కాదు.. వందలాది మంది కూలీలు..పొగాకు నారుమడుల్లో పనిచేస్తూ శనివారం కనిపించారు. కర్నూలు మండల పరిధిలోని దిగువపాడు, గార్గేయపురం, పడిదెంపాడు, ఇ.తాండ్రపాడు తదితర గ్రామాల్లో పొగాకు నారు తీస్తున్నారు. అలాగే నాట్లు వేస్తున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున కూలీలు పొలాలకు వచ్చి జాతరను తలపించారు. గార్గేయపురం సమీపంలోని ఒక పొలంలో ఈ దృశ్యం కనిపించింది. ఒక ఎకరాలో పొగాకు నాటు వేయలంటే 7,500 మొక్కలు అవసరం. ఎకరా పొగాకు నారును రూ.5,000 నుంచి రూ.6,000 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు.
– కర్నూలు(రూరల్)

## క్లుప్తంగా

### దుస్తులు ఇస్త్రీ చేస్తుండగా..

● విద్యుదాఘాతానికి యువకుడి బలి



పోసి ఓబులేస్ (ఫైల్)

**వెలుగోడు:** దుస్తులు ఇస్త్రీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన శనివారం మోతుకూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దావీదు, లక్ష్మీదేవి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు పోసి ఓబులేస్ (21) సంతానం. పిల్లల చిన్నతనంలో తండ్రి దావీదు మరణించడంతో తల్లి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించింది. కుమారుడు ఓబులేస్ నంద్యాల పట్టణంలోని ఇమేజ్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజులాగే శనివారం ఆసుపత్రికి వెళ్లేందుకు సిద్ధపడే క్రమంలో ఉదయం దుస్తులు ఇస్త్రీ చేసేందుకు గదిలోకి వెళ్లాడు. ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెల్ల మధ్యలో పుట్టిన ఓబులేస్ తండ్రి బాధ్యతలు నిర్వహించే క్రమంలో ఇలా అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురుని కలిచివేసింది. ఈ ఘటన గ్రామంలో విషాదం నెలకొంది.

### 'వేదావతి' వంతెనపై తగ్గిన వరద నీరు

● రాకపోకలు పునఃప్రారంభం



**హొళగుంద:** మార్లమడి గ్రామం వద్ద ఉన్న వేదావతి(హగరి) నదిపై నిర్మించిన వంతెనపై వరద నీరు తగ్గింది. దీంతో కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వంతెనపై వరద నీరు ప్రవహించి శుక్రవారం రెండు వైపులా రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బళ్లారి, సిరుగుప్ప తదితర ప్రాంతాలకు రాకపోకలు పునః ప్రారంభ మయ్యాయి.

### రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి



మృతిచెందిన ముని లక్ష్మయ్య

**కర్నూలు :** నగర శివారులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముని లక్ష్మయ్య (40) మృతిచెందారు. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా సంగహల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు లారీలో బీట్‌రూట్ లోడ్‌తో వెళ్తూ గుత్తి ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన రోడ్డు పక్కన ఆపుకుని ఉండగా అటుగా వెళ్తున్న ఐచర్ వాహనం తగిలి తలకు, కాళ్లకు బలమైన రక్తగాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. ఇతనికి భార్యతో పాటు కుమారుడు సంతానం. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మందుబాబులకు జరిమానా

**కర్నూలు:** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖ చేపట్టిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 79 మంది మందుబాబులకు రూ.3.95 లక్షలు జరిమానా విధిస్తూ కర్నూలు జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి అనిల్ కుమార్ తీర్పు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడి తప్పించుకు తిరుగుతున్న 79 మందిని శనివారం మెగా లోక్ అదాలత్‌లో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

### పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పాత్రికేయులకు స్వేచ్ఛ ఇవ్వాలి. నిజాలను నిర్భయంగా రాసే వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. నాయకులు తెలియజేసిన విషయాలను కూడా పత్రికల్లో వస్తే నేరమనడం హాస్యాస్పదం. అలాగే పోలీసు వ్యవస్థలో లోటు పాట్ల గురించి వాస్తవాలు రాస్తే పత్రికా యాజమాన్యంపై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో వేధించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. 'సాక్షి'పై కేసు నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదు. భయపెట్టి వాస్తవాలను తొక్కిపెట్టలేరు. – శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నంద్యాల




### నియంతృత్వ ధోరణి



ప్రజాస్వామ్యంలో మీడియాది కీలకపాత్ర. మీడియాలో వచ్చిన అంశాలకు ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. అప్పుడు ఆ సంస్థ స్పందించకుంటే ప్రెస్ బ్యూరో ఆఫ్ ఇండియా, కోర్టులు ఆశ్రయించి తప్పుడు వార్తల ఖండనకు ఫులిస్టాప్ పెట్టించవచ్చు. అయితే కూటమి ప్రభుత్వం అవేవి పట్టించుకోకుండా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. రాజకీయ విమర్శలు చేసినా కేసులు పెట్టడం, ప్రభుత్వ పరిపాలన లోపాలను ఎత్తిచూపితే మీడియా సంస్థలను నియంత్రించాలనుకోవడం అన్యాయం. సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై కక్షపూరితంగా వ్యవహరించడం అన్యాయం. వెంటనే వారిపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలి. లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.
– ఎస్.మునెప్ప, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, కర్నూలు



టీడీపీ కార్యాలయం, నారాయణ పాఠశాల మధ్య అడ్డంగా ఏర్పాటు చేసిన పోలీసు బారికేడ్లు



కేసీ కెనాల్ వినాయక్‌ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్



యూటర్న్ ఏర్పాటుతో ఇరువైపులా ట్రాఫిక్ పద్మవ్యూహం

## రోడ్డు మూసేసి.. సమస్యను తెరచి!

నగరంలో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఏ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో, ఎక్కడ బ్రేక్ పడుతుందో, వెనుక నుంచి ఏ ప్రమాదం వస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ప్రజలు నిత్య నిరకాన్ని చూస్తున్న పరిస్థితుల్లో టీడీపీ నేతలు సరికొత్త ట్రాఫిక్ సమస్యకు తెరతీశారు. అధికారం చేతిలో ఉంది కదా అని ఏకంగా రోడ్డునే మూసేశారు. ఈ కారణంగా నగర నడిబొడ్డున అత్యంత రద్దీ ప్రాంతమైన కేసీ కెనాల్ వినాయక్‌ఘాట్ వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. గాయత్రీ ఎస్టేట్‌కు ఎదురుగా టీడీపీ జిల్లా కార్యాలయం ఉంది. సరిగా ఈ కార్యాలయానికి ఎదురుగానే నారాయణ పాఠశాల నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ కావడంతో ఇక అడ్డేముంది అనుకున్నారు. కార్యాలయం వద్ద, పాఠశాల వద్ద రద్దీ తగ్గించుకునేందుకు ఏకంగా ఓ దారికి పోలీసు బారికేడ్లను అడ్డు వేయించారు. ఇదే సమయంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. సమీపంలోనే ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. మందుబాబులు ఏ పరిస్థితుల్లో వస్తున్నారో కూడా తెలియకుండా రోడ్డు దాటుతుండటం.. నాలుగైదు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలన్నీ ఇక్కడే కలుస్తుండటంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున స్తంభిస్తోంది. ఈ విషయాన్ని 'సాక్షి' దృశ్యరూపకంగా ప్రచురించడంతో పోలీసులు స్పందించారు. అక్కడ ఏర్పాటు చేసిన యూటర్న్‌ను శుక్రవారం ఉదయం సరిచేసేందుకు యత్నించారు. ఇంతలో టీడీపీ ముఖ్యనేత నుంచి ఫోన్ రావడంతో సరిచేసిన యూటర్న్‌ను యథావిధిగా తెరిచి అక్కడి నుంచి వెళ్లిపోవడం గమనార్హం. ప్రజలు ఏమైనా పర్వాలేదు, మేము బాగుంటే చాలనుకునే ధోరణి టీడీపీ నేతల్లో కనిపిస్తోంది. ఇప్పటి వరకు సాఫీగా సాగుతున్న ట్రాఫిక్‌ను, స్వార్థానికి రోడ్డు మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

# ఆంధ్రాతిలక్..గాడిచెర్ల

- వందేమాతర ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడు
- ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి మొదటి ఎమ్మెల్యే
- రాత్రి బడులు ఏర్పాటు చేసిన ఘనత గాడిచెర్లదే
- ప్రజలను ఆకట్టుకున్న గాడిచెర్ల గ్రంథాలు, రచనలు
- నిరుద్యోగ యువతకు ఆదర్శం
- నేడు గాడిచెర్ల 142వ జయంతి





కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన గాడిచెర్ల విగ్రహం

**కోవెలకుంట్ల:** తెల్లదొరల కబంధ హస్తాల నుంచి భారతదేశానికి స్వాతంత్య్రం సాధించేందుకు పోరాటం చేసిన ఎందరో మహానుభావుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఒకరు. వందేమాతరం ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడిగా, గ్రంథాలయాల అభివృద్ధికి విశిష్ట సేవలందించి గ్రంథాలయ పితామహుడిగా పేరు ప్రఖ్యాతలు గడించారు. ఆంధ్రాతిలక్‌గా జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారు. పేద కుటుంబంలో జన్మించిన గాడిచెర్ల అంచెలంచెలుగా ఎదిగి స్వాతంత్య్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించటమే కాకుండా ఎన్నో రచనలు రచించారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి ఎన్నికైన మొట్టమొదటి ఎమ్మెల్యేగా చరిత్రకెక్కారు.

**ఆంధ్రా తిలక్‌గా..**

వందేమాతర ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడిగా గాడిచెర్ల రంగప్రవేశం చేసి అంకుఠిత దీక్షతో ఉద్యమించాడు. సాహిత్యం, వయోజన విద్య, గ్రంథాలయోద్యమం, పత్రికా రచన, సంఘసంస్కరణ, సంఘీభావ ప్రకటనలు, సభలు, సమావేశాలతో గాడిచెర్ల జీవితం ముందుకు సాగింది. స్వాతంత్య్ర ఉద్యమంలో బ్రిటీష్‌వారు బాలగంగాధర తిలక్‌ను అరెస్ట్ చేసిన రోజునే గాడిచెర్లను అరెస్టు చేసి వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీంతో గాడిచెర్ల ఆంధ్ర తిలక్‌గా పిలువబడ్డాడు. జైలులో గాడిచెర్లను బ్రిటీష్ ప్రభుత్వం ముప్పు తిప్పలు పెట్టింది. జైలులో ఉంటూనే అనేక గ్రంథాలు రచించాడు. ఒకవైపు స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూ మరోవైపు రచనలు, ఆకాశవాణి ప్రసంగాలు, సభలు, సమావేశాలు, సాంఘిక సంస్కరణలు, గ్రంథాలయాల ఏర్పాటు, గ్రంథాలను సమకూర్చడం, పత్రికలు నడపడం వంటి పనుల్లో తలమునకలై ఉండేవాడు. హోంరూల్ ఉద్యమంలో గాడిచెర్ల కీలకపాత్ర పోషించడమే కాకుండా చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూ స్థాపించిన స్వరాజ్య పార్టీని ఆంధ్రలో అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం జిల్లా మార్కాపురం, గిద్దలూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలతో ఉన్న నంద్యాల స్థానం నుంచి 1928వ సంవత్సరంలో పోటీచేసి మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే మద్రాసు కౌన్సిల్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.

**ముఖ్య పట్టణాల్లో గాడిచెర్ల విగ్రహాలు**

స్వాతంత్య్ర ఉద్యమంలో ఒకవైపు పాలు పంచుకుంటూ మరో వైపు గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తూ గ్రంథాలయ పితామహుడయ్యారు. ప్రజల కోసం ఎన్నో గ్రంథాలు, రచనలు రచించి ప్రపంచ విజ్ఞానాన్ని గ్రంథాలయాల ద్వారా పాఠకుల ముందుంచారు. అప్పటి గ్రంథాలయాలు దినదినాభివృద్ధి చెందుతూ విజ్ఞాన భాండాగారాలుగా నిలిచాయి. గ్రంథాలయాల అభివృద్ధి కోసం పాటుపడిన గాడిచెర్ల నిరుద్యోగ యువతకు ఆదర్శప్రాయుడయ్యా రు. రాయలసీమ జిల్లాలోని కర్నూలు, వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఆవరణాల్లో, కోవెలకుంట్లలో నంద్యాల మాజీ ఎంపీ ప్రొద్దుటూరి బ్రహ్మానందరెడ్డి సహకారంతో గాడిచెర్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా వెలుగోడు గ్రంథాలయ ఆవరణలో రెండున్నరేళ్ల క్రితం గాడిచెర్ల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం గాడిచెర్ల 142వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వయోజన విద్యకు ప్రోత్సాహం**

కర్నూలుకు చెందిన భాగీరథీబాయి, వెంకటరావు దంపతులకు 1883 సెప్టెంబర్ 14వ తేదీన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జన్మించారు. ఈయన విద్యాభ్యాసమంతా కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లా గుంతకల్లు, గుత్తిలో సాగింది. పేద కుటుంబం కావడంతో ఇంటి పనులు చేసి మరీ పాఠశాలకు వెళ్లి చదువుకునేవాడు. చిన్నతనం నుంచి గాడిచెర్ల చదువుతోపాటు ఆటపాటల్లో ప్రావీణ్యం పొందాడు. సూక్ష్మగ్రాహి, ఏకసంధ్యాగ్రాహి కావడంతో ఎటువంటి పద్యాలు, పాఠ్యాంశాలను అవలీలగా అప్పచెప్పేతత్వం అలవర్చుకున్నాడు. గాడిచెర్ల చేతిరాత అద్భుతంగా ఉండేది. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో కళ్లు చెదిరేలా రాసేవాడు. ఇతని దస్తూరిని గుర్తించి యూనివర్సిటీ బంగారు పతకం బహూకరించింది. 1907వ సంవత్సరంలో ఎంఏ పూర్తి చేసి ఉపాధ్యాయ శిక్షణకు గాడిచెర్ల రాజమండ్రిలో ట్రెనింగ్ కళాశాలకు వెళ్లాడు. ఉదయం కళాశాలకు వెళుతూ రాత్రివేళల్లో నిరక్షరాస్య వయోజనులకోసం రాత్రి బడులు ఏర్పాటు చేసిన ఘనత గాడిచెర్లదే. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవడంతో గాడిచెర్లలో అంతర్గతంగా దాగి ఉన్న స్వాతంత్య్ర పిపాస, దేశభక్తి ఒక్కసారిగా పెల్లుబికాయి.

### కుందూలో దూకిన వృద్ధురాలు

- అనారోగ్య కారణాలతో ఆత్మహత్యాయత్నం
- ఆచూకీ కోసం నది వెంబడి గాలింపు చర్యలు



మృతి చెందిన ఫకూర్‌బీ (ఫైల్)

**ఉయ్యాలవాడ:** మండల కేంద్రం ఉయ్యాలవాడకు చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్య కారణాలతో కుందూనదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీటి ఉధృతి అధికంగా ఉండటంతో ఆమె ఆచూకీ గల్లంతైంది. గ్రామానికి చెందిన పూల ఫకూర్‌బీ(80) అలియాస్ గుత్తి ఫకూర్‌బీ అనే వృద్ధురాలి భర్త దాదాపు 30 ఏళ్ల క్రితం క్రితం మృతి చెందాడు. కుమారుడు కూడా గత 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. కోడలు, ముగ్గురు మనవళ్లు వుండగా వారి వద్దనే జీవనం కొనసాగించేది. కాగా కొన్నాళ్లుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ వుండేది. శనివారం ఉదయం 7 గంటల సమ యంలో ఇంటి నుంచి రూపనగుడి గ్రామం వైపు వెళ్తుండగా కుందూనది వంతెన వద్ద గంగపుత్రులు అంబటి రమణయ్య, గగ్గెర తిక్కయ్యలు.. వృద్ధురాలిని ఎక్కడికి వెళ్తున్నావని పలకరించారు. రూపనగుడిలో తమ బంధువులను చూసేందుకు వెళ్తున్నానని బదులు ఇస్తూ ముందుకు వెళ్లింది. నిమిషాల వ్యవధిలోనే నీళ్లలో ఏదో పడిన శబ్దం రావడంతో గంగపుత్రులు వెనుదిరిగి చూశారు. వంతెనపై వెళ్తూ వృద్ధురాలు కుందూలోకి దూకి నీటి ఉధృతికి కొట్టుకుపోతూ గల్లంతు కావడం వారు చూశారు. విషయం వృద్ధురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ప్రసాద్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గల్లంతైన వృద్ధురాలి ఆచూకీ కోసం మండలంలోని కుందూ వెంట వున్న గ్రామాల వీఆర్‌ఓలు గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం తహసీల్దార్, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. నది ఉధృతి తగ్గేంత వరకు ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్‌ఓలు లక్ష్మీనారాయణరెడ్డి, దాదా సాహెబ్, వెంకటలక్ష్మి, చెన్నప్పను ఆదేశించారు.

### ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి



ఉపాధ్యాయులను సన్మానించిన పీఆర్‌టీయూ నాయకులు

**కర్నూలు సిటీ:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కరుణానిధి మూర్తి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు విధులు నిర్వహించారని, ఇప్పటి వరకు బకాయిలను చెల్లించలేదన్నారు. వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించి, 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ధనుంజయలు మాట్లాడుతూ.. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని దసరా సెలవుల తరువాత నిర్వహించాలన్నారు. దసరా సెలవులను ఈ నెల 22 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు ప్రకటించాలన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన వారిని, ఈ నెల 5వ తేదిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని సన్మానించారు. ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కెవి రమణయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా అంతటా పోలీసు తనిఖీలు

**కర్నూలు:** రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ల వారీగా శనివారం వాహన తనిఖీలు నిర్వహించి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బైకులు నడిపేవారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని, మద్యం సేవించి వాహనం నడపరాదని, తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు.